

# కేతిగాడూ బంగారక్కా



వినోదమనేది అనాదినించీ వున్నది. మానవులకు తక్కిన అవసరాలతో పాటు అదీ ముఖ్యమే. పశుపక్ష్యాదులనూ, మృగాలను చెట్టూ చేమలను అనుకరిస్తూ, ఆటా పాటా నేర్చి వినోదమిచ్చేవారు. క్రమంగా వినోదం జీవనాధారంగా గూడా అయింది. వీధి భాగవతులు, పగటి భాగవతులు, గారడీవారు, దొమ్మరాటా, తోలుబొమ్మలాటా, యానాది భాగవతం గూడా మంచి వినోద మిచ్చేవి. మన పురాణగాథలు, ప్రజానీకంలోకి బాగా చొచ్చుకుపోయాయి. వారికీ జీవనాధారమై వినోదమనే కళ అయింది. ప్రహ్లాద, మార్కండేయ, కృష్ణలీలలు, రామాయణం, భారతంలోని ఘట్టాలు ఆడేవారు. కూచిపూడి భాగవతులు, ఉషాపరిణయం, గొల్లకలాపం, భామా కలాపం ఆడేవారు. తరవాత సురభి నాట్యమండలి వచ్చింది. అది సంచారం చేస్తూ నాటకాలాడి ప్రజలకు వినోదమివ్వటమే గాక, స్త్రీలను ఆడవేషాలు వేయనిచ్చి ప్రేక్షకులకు పరిచయం చేశారు. వనారస గోవిందరావు ఆ కంపెనీని నడిపేవారు.

పురాణగాథలు విసుగెత్తకుండా వుండగలందులకు హాస్యం జోడించేవారు. తోలుబొమ్మలాట ప్రదర్శించేవారే కేతిగాడు బంగారక్కలను తెరమీద ఆడించి వినోదం విలువ హెచ్చించారు. చర్మాన్ని శుభ్రం చేసి కత్తిరించి, బొమ్మలాగా చెక్కిన కొయ్యమీద అతికించి, రంగులేసి, కీళ్లవద్ద పేము పుల్లగుచ్చి పట్టుకుని బొమ్మలనాడించేవారు. పెట్రోమాక్సు లైటు దేదీప్యమానంగా వెలుగుతూ తెల్లని తెరమీద బొమ్మలాడేవి. వెనకాల హంగుదారులు పాటలూ మాటలూ వల్లించేవారు, కథ సాగేది. హాస్యమొక్కొక్కసారి మోటు అయేది.

ఆ కాలంలో బాల్యవివాహాలే జరిగేవి. అల్లుడు యిరవై లోపు టీనేజరైతే అత్త పాతికాముప్పై మధ్య వయసు. ఇద్దరిదీ మంచి వయసే. చిన్నపెళ్లానికి సరసం తెలియదు. కనక అల్లుడు అత్తతోనే సరసాలు ఆడేవాడు. అల్లుడు రాగానే మర్యాదలు చెల్లించాలి. అందుకని యేమి పిండివంటలు కావాలి అనేది వాళ్లిద్దరి మర్యాదా వెకిలితనాన్ని వెల్లడించేది. ప్రేక్షకులానందించేవారు.

తెరమీద కెక్కుతూనే అల్లుడు మూడుపిల్లి మొగ్గలేసి చేతులు కాళ్లూ ఆడిస్తూ నవ్వేవాడు. అత్తకి మంచి చీరా రవికా నగలూ కొప్పూ, నడుమున చెయ్యుంచి, రెండో చెయ్యి ఆడిస్తూ కదుల్తూ అడిగేది.

''గారెలొండెదా సిన్నోడ! సిన్నోడ! మరి బూరెలొండెదా సిన్నోడ! సిన్నోడ'' అని ఆడేది.దానికల్లుడు ఆడుతూ ''గారెలొండితే గరగరమంటై। మరి బూరెలొండితే బుగ్గలు తీపషు। గారెలొండావే హత్తమ్మో। మరి బూరెలొండవే హత్తమ్మో''

సమాజంలో అలాటి అత్తా అల్లుడూ కంటబడుతూనే వుంటారు మనకు. కొందరు నవ్వుతారు. చిన్నప్పుడే హేమచంద్రుడు, వాడు చేసే అల్లరికి కేతిగాడని నిక్‌నేమ్ తెచ్చుకున్నాడు. హాని జరగకపోయినా ఆకతాయితనం కనబడేది. అలాగే పెద్దవాడౌతూ పట్టభద్రుడై, వుద్యోగీ అయినాడు హేమూ. పెళ్లొద్దో పెదబావా అని పాడేవాడు. యేదో మిషపెట్టి సంబంధాలు తిప్పేశాడు. ''కలవారి బిడ్డ కావాలేమో హేమూకి'' అనుకున్నారు మధ్యతరగతివారు.

సత్త్వరజతమో గుణాల్ని కలిపి మాయా అని పిలిచారు వేదాంతులు. మాయను గెలిచినవాడు లేడూ మరిమరి నీవు చూడూ అని పాడారు కవులు. ఇనుపకచ్చడాల్ కట్టిన మునిముచ్చు లెల్ల తామరస నేత్ర వింట్లే బందాలుగారె అని పాడారు.

ఆకతాయీ అల్లరీ వున్నాహేమూ స్త్రీల విషయంలో జాగర్తగానే మసులుకున్నాడు. కలంచనే స్త్రీల మాయల్ ధీరచిత్తంబులన్ అన్నాడు కవి. యెవరి వలలోనూ పడలేదు హేము. కాని ప్రేమకోసమై తపించి పోయెనె అనే పాటలాగా నాదీ స్త్రీ అనే కోరికను జయించలేకపోయినాడు. దైవం అనుకూలించాడు. ఒకస్టూడెంట్ అందింది. స్టడీ చేశాడు హేమూ. సింపుల్‌లైఫ్. హై థింకింగ్. యేదీ డిమాండ్ చేయదు. ఆశయాలూ మంచివే గాక, మెత్త మెత్తగా కనిపించింది. మరో అనుకూలత. ఆ స్టూడెంట్ మాతాజీ యీజ్ వెరీ ఫాండాఫ్ మనీ అని తెలిసింది. ప్లాన్‌వేసి, ఆశగొలిపి, జాలం విసిరి బరువు భారాలు తనవేనని

చూపాడు హేమూ. స్త్రీ వశమైంది. చాప్లిన్ యవ్వనం మొదటిదశలో ఒక మైనర్‌గళ్‌తో బంధం పెంచుకున్నాడు. ఆగళ్‌నటి. షూటింగ్ జరుగుతుండగా ఫ్లోర్‌మీదపడిపోయింది. ఆ గళ్ మాతాజీ గలభా చేసి, ''రేప్ చేశాడు. నా కూతుర్ని వంచించాడు. వంచకుడు. అభివృద్ధిలో కొస్తున్న పిల్లను పనికిరాకుండా చేశాడు'' అని యాగీ చేస్తే, ''పెళ్లాడుతాను. తప్పేమిటి నాకు వంచించాలనీ లేదు. ద్రోహచింతా లేదు'' అని పెళ్లాడాడు చాప్లిన్. అదే మొదలు. రెండున్నర సంవత్సరాలు, నరకం చూపారు. భీభత్సం, అవమానం సృష్టిస్తూ డైవోర్సువేపు నెట్టుకెళ్లింది చాప్లిన్ని గళ్ మాతాజీ. తనస్వంత యింట్లో తను పరాయి వాడైనాడు. ఆలనా పాలనా లేదు. గొల్లున గోల. ఇంటినిండా కొత్తమొహాలు. భరించలేక చాప్లిన్ డైవోర్సుకు పెట్టి సర్వస్వం కోల్పోయాడు. కాని దైవానుగ్రహంతో, ''కందుకము వోలె మనుజుడు'' అని కవి చెప్పినట్లు పడుతూ లేస్తూ ప్రపంచఖ్యాతి పొంది, నైట్ హుడ్‌గూడా తెచ్చుకున్నాడు పెద్దతనంలో.

సరీగ్గా అలాగే క్రైసిస్‌లో యిరుక్కున్నాడు హేమూ. కాని మెంటల్ బాలెన్సు కోల్పోక, పరారీ అయిన గళ్‌ఫ్రెండ్ లేడీ లా మాలినిని వెతికి తెచ్చి మాతాజీ బంగారక్క కిచ్చి, మాతాజీ నోరు మూయించగలిగాడు. ఇంటర్‌వల్ లాగా గలభానించి కొంత విశ్రాంతి పొందాడు. దేవుని లీలలు తెలియగ తరమా అన్నట్లు, దూరతీరాన వెలిగించిన కాంట్రాక్ట్ జాబ్ ముగిసింది. టెంపొరరీ జాబూ అయిపోయింది. రిట్రెంచ్‌మెంట్ వచ్చి, ఇచ్చిక వుద్యోగవిరమణలు వచ్చి యెంత ప్రయత్నించినా జాబ్ అందకపోగా, తన డబ్బున్న బాంక్ దివాలా తీసింది. డిపాజిటర్లందరితో పాటూ హేమూ గూడా కోల్పోయి కట్టుగుడ్డలతో మిగిలాడు సమాజంలో.

ఆదుకోటం మాట దేముడెరుగు, ధనమూల మిదం జగత్ అనే సామెత ఋజువు చేస్తూ, డబ్బు చేతులో పడక విలవిలలాడింది అత్తాజీ బంగారక్క.

హేమూ నవ్వుతూ, ''వుంటే నీ చేతులో పోసేవాడినే అత్తాజీ. ప్రస్తుతం నహీ. అందగానే నీ చేతిలో పోస్తా అత్తాజీ'' అని రాజీ ప్రయత్నం చేశాడు.

''వీడి భరతం పడతా. వుండీలేదంటున్నాడు వంచకుడు. గిరీశంలాగా నా కూతుర్ని మెతకదాన్ని నోరులేని దాన్ని వంచించాడు. రామప్పంతులులాగా జుట్టూ జుట్టూ ముడేస్తున్నాడు'' అని పళ్లు కొరికింది అత్తాజీ. పైకి ఫార్మాలిటీస్ చెల్లిస్తూ మర్యాదస్తురాలిలాగా వుంటున్నది.

ముద్దుల సుపుత్రుడి చదువుసాగాలి. ముద్దుపట్టి జగన్మోహిని కొరకరాని కొయ్య అయింది. కీచకుడంటి సుపుత్రుడింట బైఠాయించి, కుండల్లో గుర్రాల్ని తోలుతూ డబ్బు డిమాండ్ చేస్తూ సొంట్లు సోధిస్తున్నాడు. తలపట్టి పోయి, చికాకు పడి, ఆదుకునేవారు లేక, హేమూ కంటికి ఆపిల్‌పండులాగా కనబడుతుంటే, కోసి తినాలనిపించింది. మాలిని తన రెండు కూనల్నీ ముద్దులాడుకుంటూ చీకూ చింతా లేకుండా, నిమ్మకి నీరెత్తినట్టున్నది. ఒళ్లు రవులుకుపోయింది బంగారక్కకి. చేతులో డబ్బాడక చిమచిమలాడుతున్నది. అందర్నీ యిరిటేట్ చేసి, రెచ్చగొట్టి గలభా చేసి మాలినిని ప్రయాణం కట్టించింది. మాలినికి గలభాకి మూలకారణం తెలియరాలేదు.

''హేము తానున్న వూరు రావద్దన్నాడు'' అన్నది.

అశాంతం చూస్తేనే మంట బంగారక్కకి. తనవల్లేనే వుత్తిత్తులాగా యెగరాలి. ''మా గొప్ప హేమూ గదూ! ఉద్యోగం వూడింది కేతిగాడికి. ముష్టెత్తుకుంటున్నాడు వంచకుడు. ఆ ముష్టిలో కొంచెం వీరముష్టినీకు పెడతాడు. పద. భోగభాగ్యాలు పంపకాలు యేమిలేవు కేతిగాడికి'' తల విసిరి ప్రయాణం చేయించి తెచ్చి, వేరింటి కాపరం పెట్టించి కూన మెళ్లో చిన్ని బంగారు గొలుసు అమ్మి తెచ్చి చట్టీలోటా కుండా బొచ్చె, మంచం కంచం కొనిబెట్టి వుడాయించింది బంగారక్క.

చిన్ని చిన్ని పనులు చేస్తూ, గుండె దిటవుతో సపోర్టు చేసుకుంటూ వస్తుండగా హేమూ డాక్టర్ ఫ్రెండ్ పిలిచి, టెక్నీషియన్‌గా తన లాబ్‌లో జాబ్ యిచ్చాడు. తన వారివద్దే వున్నాడు హేము.

లేడీ లౌ దాని కూనా గురుజూ కనబడలేదు. గుండె బేజారుకాకుండా చిక్కబట్టి అనుకున్నాడు. '' ఇదేం లౌ? ఒక చోట వుండదేం? చపల కాదే పేరు! నిదానంగా వెతికి మళ్లా పట్టాడు. మంచి రోజు రావాలి. చిత్రం చిత్రం మహా చిత్రం అన్నట్టు ప్రియురాలి బలగం కొంప నింపారు.

'' ఈ చీమలన్నీ యిన్నాళ్లూ యే పుట్టలో వున్నాయో'' అనుకున్నాడు హేమూ. ఖర్చులు, చాకిరీ, రక్షణ తన డ్యూటీ అయింది. కేతిగాడు బుర్ర వుపయోగిస్తే తెరవెనక అత్తాజీ బంగారక్క హంగుదారులాగా కనిపించింది. ఇహిహీ అని నవ్వుకున్నాడు. ''భలే అత్తాజీ! యేదో యీ మాలిని అందాక ఆరోగ్యంగా వుండి మనస్సుకి హాయి కలిగాయనుకుంటే గులాబీ తొడిమకు ముళ్లులాగా అత్తాజీ ఆమె బలగం'' అని మళ్లా యిహిహీ అని నవ్వుకున్నాడు.

జాబ్‌కి అప్లై చేస్తే యింటర్వ్యూకి రమ్మని పిలుపు అందింది. మాలిని వున్న వూళ్లోనే యింటర్వ్యూ.

''మాలినీ! నేను మీ పట్నం యింటర్వ్యూకి వెళ్లాలి. నువ్వక్కడే వుండివుంటే బాగుండిపోయేది. రావద్దని ఆంక్ష పెట్టినా, నన్ను ఖాతరు చేయక యీ వూళ్లో వెలిసి కాపరంగూడా వెలిగిస్తూ వంశాభివృద్ధి చేస్తున్నావు. పోనీలే గానీ మాలినీ ప్రియురాలా! ప్రేయసీ! మీ పట్నంలో నువ్వుండి వచ్చిన యింటికి అద్దె యెవరు కడుతున్నారు? అది వెకేట్ చేయలేదని తెలిసింది. నువ్వా! నీ మాతాజీయా? యెంత బలగమున్నా నీ రెస్పాన్సిబిలిటీ నాదే. తప్పదు'' అన్నాడు నవ్వుతూనే. ఆ నవ్వు వెనక దెప్పుడర్థమైంది మాలినికి. ''నేనే రెంట్ చెల్లిస్తున్నానూ హేమూ గారూ'' అన్నది. పిల్లల చేత అన్నం తినిపిస్తున్నది. రాత్రి యెనిమిదైంది. '' ఐసీ! ప్రేయసీ! అక్కడాయిక్కడా కూడా లాడ్జింగ్ ఖర్చులు నేనే పెట్టుకోవాలన్నమాట. పోన్లేగానీ లౌ! నీ దగ్గర డూప్లికేటున్నదా'' అనడిగాడు నవ్వుతూనే మంచం మీద కూచుని పిల్లల్ని చూస్తున్నాడు హేమూ.

''వున్నది'' అంటూనే లేచిపోయి డూప్లికేట్ కీ తెచ్చి హేమూ కందించింది మాలిని.

2

రాత్రి పూట, స్టేషన్లో, తామెక్కవలసిన రైలు కోసం యెదురుచూస్తూ ప్లాట్‌ఫామ్ మీద నిలబడివున్న హేమూనీ, తన ముద్దులపట్టి జగన్మోహినినీ రెడ్‌హేండెడ్‌గా పట్టుకున్నది అత్తాజీ బంగారక్క.

వ్యవహారం ముగించుకుని యింటికెళ్తే యింటామె పున్నమ్మ బంగారక్కకి వార్నింగ్‌లాగా చెప్పింది.

''హేమచంద్రుడిని యిక్కడికి రావద్దని కూక లేయి బంగారక్క. నీ ముద్దులపట్టి జగన్మోహినేమో ''తన కోసమే వస్తున్నాడంటూ మేడమీద హేమూ గదిలో దూరి కిచకిచలాడుతున్నది. వాడే అద్దె చెల్లిస్తాడని కులుకుతూ నవ్వుతున్నది అప్పుడే బకాయి పడ్డారు మీరు. అద్దె లేదు నా శ్రాద్ధం లేదు. నువేమో కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతూ వుంటావు. తిరిగే కాలు నీది. హేమచంద్రుడేమో కల్లు తాగిన కోతిలాగా ప్రవర్తిస్తున్నాడు. ఆడదానివని చూస్తున్నా. వీధిన బెట్టగలను''.

''రంకు నేర్చినమ్మ బొంకనేర్చిందనీ'' అని మూతి విరిచింది పున్నమ్మ.

''హేమూ అలాటి వాడు గాదు పున్నమ్మ పిన్నీ. నా బిడ్డలాటివాడు. అమ్మాయి వెర్రిబాగుల పిల్ల సమిష్టి కుటుంబంలో పెరిగిందైపాయె. అత్తారిదీ సమిష్టికుటుంబమే. ఆ అలవాటు వల్ల చనవుగా తిరుగుతుందంతే'' అని నవ్వింది బంగారక్క ''కీచకుడుండాలే'' అనుకున్నది.

''యెత్తుకు పైయ్యెత్తు వేశాడే కేతిగాడూ?'' అని తలపంకించింది వేటాడి పట్టేసింది.

''నిక్‌నేమ్ నిజం చేశావే హేమూ. దీనిమీదా యింద్రజాలం విసిరి వెర్రిబాగులదాన్ని పట్టావే. దాని ఆస్తిమీద నీ కన్నుపడింది. దత్తు చేసి ఆస్తిమీద హక్కులేకుండా చేసి మనోవృత్తి యిప్పించాలని ప్లాను. ఇంతవర కూ చేసిన వుపకారం చాలదూ? ''హా! మోహినీ! అని విరహం నటించి దీన్ని పట్టావూ?''

''నేనెవర్నీ వంచించనూ లేదు. పట్టనూ లేదు. ఆవిడే నా మీద భ్రమ పెంచుకున్నది. నేనింతకన్న అందమైన వాళ్లనే శ్రీమంతులనే చూశా''. మా అమ్మకిచ్చినట్టు, మాలినికిచ్చినట్టు, నా చేత యేం పెట్టక్కర్లేదు. నన్ను నేను సపోర్టు చేసుకోగలను. ఫాన్సీ షాపు నడుపుతున్నానా. నేనే నీ కిస్తా. నేను లేడీ లానే. నేనూ కనగలను. కనిపించు హేమూ'' అంటూ వెంటవచ్చింది. మాలినిని నా కందించిననాడు, నా మీదికి వదిలిననాడు లేని బాధా తప్పూ యివాళే యెందుకు వచ్చిందీ బైటికీ? డబ్బు కక్కటం లేదనా? పప్పు బెల్లాలకింద ఖర్చు చేయటానికి కొంగున లేదనా? యాగీ చేయి. చేతనౌగా! ఆవిడే ఐచ్ఛికంగా నన్నాశ్రయించింది. మాలినికిష్టమే. మాలినికి లేని బాధ నీ కెందుకూ'' అన్నాడు నవ్వుతూనే.

''యేదీ కక్కటం లేదే? చెడ్డపేరు మిగిలింది నాకు'' అంటున్నది బంగారక్క.

రైలు రానూ వచ్చింది. ''నీ దోపిడీ నుండి తప్పించుకోవాలని నా వెంటబడింది'' అంటూ రైలెక్కారిద్దరూ. రైలు కదిలిపోయింది.

3

రై రై మని దుమారం లాగా వచ్చింది కూతురింటికి బంగారక్క.

''మాలినీ. గడుస్థనమంటే నీది. సవతులై సఖ్యంగా వుండాలనుకుంటుంటే, కళ్లల్లో నిప్పులు పోసుకుని విడదీయాలని చూస్తున్నానంటున్నాడు వంచకుడు కేతిగాడు. దత్తుచేసి ఆస్తిలాగాలని వాడి పథకం. మాలినికి లేని బాధ నీ కెందుకు అని మొహం మీద నవ్వాడు కేతిగాడు'' అని మెటికలు విరిచింది బంగారక్క.

మాలినికి మోసం మెల్లిగా అవగతమతున్నది. గుడ్డి దీపం వెల్తురులో తెరవెనక భాగవతమూ కాన వచ్చింది. వున్న వూరు వదిలి వచ్చి నిందలూ నిష్ఠూరాలూ విన్నది. మిన్నకున్నదిగానీ అది మాతాజీ నిర్వాకం అని చెప్పలేకపోయింది హేమూతో.

వాంతులూ జ్వరంతో నీరసించిగూడా పసివాడిని చూస్తూ రోజులు గుడుపుతున్న మాలినికి గుండెలు మండినై. వుండబట్టలేక.

''నువ్వు తక్కువ తినలేదే'' అన్నది.

మండిపడి గాజులు దూసిమ్మని లాక్కుని కొంగున ముడేసుకుంటూ రైలందుకోవాలని వెళ్లిపోయింది బంగారక్క.

4

జిగురులాగా పట్టుకున్నాడు పాపయ్యశాస్త్రి.

''యేమంటావు హేమూ బావా! నాకు ఫస్టొచ్చింది. నేను ఐ ఐ టి చదివే అవకాశమొచ్చింది. అప్లై చేయాలి. ఇంటర్వ్యూకెళ్లాలి. నిన్నడగమన్నది అమ్మ. నువ్వు ష్యూర్‌గా చదివిస్తావన్నది. చాలా సంపాయిస్తున్నావుగా. నా తోడబుట్టిన వాళ్లూ నీ పక్షమే. ఇద్దర్ని సపోర్ట్ చేస్తున్నావు. రెండిళ్లకద్దె చెల్లించగలిగినవాడివి నన్ను సపోర్ట్ చేయగలవు'' అంటున్నాడు.

నిద్రవేళ. రాత్రి పదిన్నరయింది. పిల్లలు మాలినీ లోపల నిద్రబోతున్నారు. ఆరుబయట మంచమ్మీద హేమూ నిద్ర కొరుగుతున్నాడు. కళ్లు బరువుగా వున్నాయి. ఆ రోజున డాక్టర్ ఫ్రెండ్ లాబ్‌లో అన్నీ క్లీన్‌చేసి, ఆర్డర్లో వుంచి, పిప్పెట్, బ్యూరెట్ యెదురుగా వుంచి, బ్లడ్ లెవెల్ నోట్ డౌన్ చేసి లాబ్ మూసి లెన్సెస్ వున్న పెట్టె బల్లమీదుంచి యింటికి వచ్చేప్పటికి పది కావస్తున్నది. మాలిని యెదురుగా పెట్టిన రెండు ఆవడలూ, రెండు గారెలూ, అల్లప్పచ్చడీ, సెనగపచ్చడీ, కంది పచ్చడీ చారూ అన్నం, అప్పడం, వడియం, పెరుగన్నం పూర్తి చేసి చేయీ మూతీ అద్దుకుంటూ మంచం మీద వాలాడు హేమూ. పైరుగాలి వీస్తున్నది.

తన ముద్దుల సుపుత్రుని నా మీదికి ఉసికొలిపిందే అత్తాజీ. జాగిలమల్లే వాసనబట్టి వచ్చాడు. జిగురులాగా పట్టుకున్నాడు. అత్తాజీ స్టేషన్లోనే గొణిగింది.

''వెర్రిబాగులదాన్నీ వాడుకుంటున్నావుగా? యేమీ రాల్చవైపాయె. పాపన్నని చదివించు''

''నేనావిడను వాడుకోటమేమిటీ? ఆవిడే నన్ను వాడుకుంటున్నది. ''నన్నూ విడచీ కదలకురా। ఓ హేమచంద్రా! నిన్నూ బాసీ నేననూ నిమిషమోర్వగలేను'' అని పాడుతూ పట్టుకున్నది'' అని నవ్వాడు తాను.

బరువైన కనురెప్పలు విప్పి చూస్తూ అన్నాడు హేమూ. పక్కనే యెత్తు పీటమీద కూచుని కాళ్లాడిస్తూ నవ్వుతున్నాడు పాపయ్య. చొక్కాలేదు. జంధ్యం, చిన్న తువాలూ బుజం మీద. వీధి లైటు పడుతున్నది. చెవుల పోగులు మెరుస్తున్నాయి. క్రాపూ, వేలికి వుంగరం. గూడకట్టు లుంగీ.

''నీకూ ఫస్ట్‌క్లాసూ రాలేదు! ఐ ఐ టి సీటూ రాలేదు! పాపాయివా? ఆడవాళ్ల మీద ఆధారపడి యెన్నాళ్లు చదువువుతా? పాసు మార్కులొచ్చాయి నీకంతే. మీ ప్రిన్సిపాల్ నా ఫ్రెండే. పాపన్నకి జాబ్ చూపించు అనడిగా. తన కజిన్ ట్యుటోరియల్ స్కూల్ నడుపుతున్నాడుట. లెక్కలు ట్యూటర్‌గా జాబ్ యిప్పిస్తానన్నాడు. తగినంత స్టాఫ్ లేదుట. ధరఖాస్తు పెట్టించమన్నాడు. జాబ్ ష్యూర్ అదే లాభం. మరోటి. ట్యుటోరియల్ నడిపేవాడికి పెళ్లీడొచ్చిన కూతురున్నది. కంప్యూటర్ సైన్సెస్ పాసైంది. జాబ్ చేస్తున్నది. నీకిచ్చి పెళ్లి చేస్తాడు. చేసుకో. ఆ పిల్ల తల్లి తన పేరవున్న యిల్లు కూతురుకి చెందేట్టు వీలునామా రాసింది. నీకు సంపాయించి పెట్టే పెళ్లామూ, జాబ్ యిచ్చే మామ రెడీగా వున్నారు. ఒకరడగమంటే మాత్రం, నీ అంతరాత్మ మంచి చెప్పదా'' అన్నాడు హేమూ.

''యేమో. అడగమన్నది. చదివిస్తాడన్నదీ. అడిగాను. ఇహిహీ!'' అని లేచి వెళ్లిపోయాడు శాస్త్రి.

4

బంగారక్క మరో పని చక్కదిద్దుకుని వచ్చేప్పటికి పాపన్న జాబ్‌లో వున్నాడు. కేతిగాడికి సిటీలో మంచి జాబ్ లభించింది. ఫామిలీని తీసుకుని వుడాయించాడు. అవీ తాజా వార్తలు. గుడ్డిలో మెల్లలాగా పాపయ్య పెళ్లి స్థిరపడిందని సరిపెట్టుకున్నదిగానీ'' యీ కేతిగాడినిట్లా వదులుతానా'' అనుకున్నది బంగారక్క.